
వీపనగండ్ల కల్వరాళ్లలో..


ఖిల్లాఘనపురంలో..

త్యాగానికి ప్రతీక బక్రీద్


ఆత్మకూర్‌లో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

పెబ్బేరు: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండగను గురువారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈద్గాలు, మసీదులలో సామూహిక ప్రార్థనలు చేశారు. మండల కేంద్రంలోని జామా మసీద్ నుంచి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు ధార్మిక సందేశం ఇచ్చారు. అలాగే అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు జామా మసీద్ దగ్గర ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్ యాదవ్, ఎంపీపీ గాయత్రి, సర్పంచ్ వినీలా రాణి తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని జామియా, సయ్యదీయ, మదర్సాలతో పాటు ఈద్గాలలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనులు నిర్వహించారు. ఆయా మసీదుల నుంచి ఈద్గాల వరకు ర్యాలీగా వెళ్లారు. మౌలానా ముక్తదీర్ ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని పేర్కొన్నారు. నమాజీల అనంతరం పొటేళ్లను బలిచ్చి బంధువులకు, స్నేహితులకు పంచిపెట్టారు.

శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణమ్మ, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ ఎం.శ్రీధర్‌గౌడ్, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రి, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు చెన్నయ్య, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, పోషన్న, యాదమ్మ, నాగలక్ష్మి, మండ్లరామకృష్ణ, తబస్సూంమోసిన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఈద్గా దగ్గర కాంగ్రెస్ మండల నాయకులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గంజాయి రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మున్నూర్ జయశంకర్, సీనియర్ నాయకులు దేవూజా నాయక్, అసెంబ్లీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ప్రతాప్, శ్రీనివాస్, యాదయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.


మదనాపురంలో..

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు కల్వరాళ్ల, తూంకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల తదితర గ్రామాలలో ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాలలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్దార్, అమీర్, రజాక్, ఖాజా, అక్బర్, మైనుద్దీన్, రుక్మద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు రేమద్దుల, తెల్లరాళ్ళపల్లి, బుసిరెడ్డిపల్లి, చింతకుంట, శాగాపూర్ గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమరచింత: పట్టణ కేంద్రంలోని ఈద్గా వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. అనంతరం పూర్వీకుల సమాధులను సందర్శించారు. పట్టణ మున్సిపల్ చైర్ పర్సన్ మంగమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

మదనాపురం: మండల కేంద్రంతో పాటు దుప్పల్లి, కొత్తపల్లి, రామన్‌పాడు, అజ్జకొల్లు, గోపన్‌పేట, రామన్‌పాడు, కొన్నూరు, తదితర గ్రామాల్లో బక్రీద్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్ పాషా, మార్కెట్ మాజీ చైర్మన్ వెంకట్ నారాయణ, సీనియర్ నాయకులు నాగన్న యాదవ్ పాల్గొన్నారు.


పాన్‌గల్ ఈద్గా వద్ద..


రంగాపురంలో..

భక్తులతో ఆలయాలు కిటకిట


రంగాపురంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెబ్బేరు రూరల్: తొలి ఏకాదశి పురస్కరించుకొని గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాథస్వామి ఆలయంలో 108 కలశాల గంగాజలంతో రంగనాథుడికి అభిషేకాలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, భక్తులు పృథ్వీరాజు, సితార వెంకటేశ్వర్లు, అర్చకులు విష్ణునారాయణ, కన్నయ్య, నరసింహ్మ పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. కుటుంబసభ్యులతో ఆలయ పరిసరాలు సందడి వాతావరణం కనిపించింది.

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలో వివిధ గ్రామాలలో ఆలయాలలోని భక్తులు తొలి ఏకాదశి పుర్కష్కరించుకొని శివాలయం, రామాలయం, ఆంజనేస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, గణపతి పూజ, హోమాలలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి బండి సంజయ్ పూజలు



మదనాపురం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గురువారం ఆత్మకూర్ బహిరంగ సభకు వెళ్తూ మార్గమధ్యలో మండల కేంద్రంలో బస్టాండు కూడలిలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు పార్టీ నాయకులు, కార్యకర్తల ఘన స్వాగతం పలికారు.

విద్యార్థికి సన్మానం



ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి చంద్రశేఖర్ ఎకనామిక్స్‌లో 99 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థి చంద్రశేఖర్‌ను డీఐఈఓ వెంకటేశ్వర్లు సన్మానించి వెండి పతకం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాలమూరు ఎకనామిక్స్ అసోసియేషన్ సభ్యులు, కళాశాల ప్రిన్సిపాల్ రాధ, అధ్యాపక బృందం సంతోష్‌రాజ్, ఫెరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

కేసు నమోదు

వనపర్తి: మండలంలోని పెద్దగూడెం గ్రామ శివారు ప్రాంతం నుంచి అక్రమంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం అర్ధరాత్రి ఓ రైతు వ్యవసాయ పొలం నుంచి అక్రమంగా టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. పెట్రోలింగ్ పోలీసులు అకస్మికంగా తనిఖీ చేసి విచారణ చేయగా ఎలాంటి అనుమతి పత్రాలు లేవని గుర్తించారు. ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, అల్లీపూర్ కృష్ణలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పట్టుదలతో లక్ష్య సాధన సులువు


నిఖిల్‌సాయిని సన్మానిస్తున్న శంకర్‌గౌడ్

వనపర్తిటౌన్: పట్టుదలతో లక్ష్య సాధన సులువు అవుతుందని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఇటీవల ఇండియన్ డిఫెన్స్ అకాడమీలో ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్‌గా నియామకం అయిన నిఖిల్‌సాయియాదవ్‌ను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువకుల చేతుల్లో ఉందన్నారు. మత్తు పదార్థాలకు బానిస అయ్యి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన నిఖిల్‌సాయి ఫ్లెయింగ్ ఆఫీసర్‌గా ఎదగడం జిల్లాకు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్. మురళీధర్, సాహితీవేత్తలు జానజ్వాల, బైరోజు చంద్రశేఖర్, ఎస్ చంద్రశేఖర్, ఎంఏ సత్తార్, బండారు శ్రీనివాసులు, గంధం నాగరాజు, వెంకటేష్, చంద్రకళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: వనపర్తి జిల్లా కేంద్రంలోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఫ్లయింగ్ ఆఫీసర్‌గా నియామకం అయిన నిఖిల్‌సాయియాదవ్‌ను గురువారం మండల కేంద్రానికి చెందిన యువకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణయాదవ్ యువజన సంఘం సభ్యులు, సదర్ సమ్మేళన ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలి


మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్

పాన్‌గల్: దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజనుడికి పోడు భూముల పట్టాలు ఇవ్వాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యనాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం శుక్రవారం నుంచి పోడు భూముల పట్టాలను పంపిణీ చేస్తామని ప్రకటించిందని దీనికి అనుగుణంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న చేసుకుంటూ దరఖాస్తు చేసుకున్న గిరిజన రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. అర్హులకు అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అన్నారంతండా సర్పంచ్ రంగానాయక్, కిష్టాపూర్‌తండా సర్పంచ్ దేవ్‌సింగ్, గిరిజన సంఘం నాయకులు రేక్యా నాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

గోపాల్‌పేట: ఇటీవల చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ ఠాగూర్‌నాయక్ కుటుంబాన్ని గురువారం ఆ పార్టీ నాయకులు మేఘారెడ్డి, సత్యశీలారెడ్డి, కౌన్సిలర్ బ్రహ్మం పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందించారు. అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, శివన్న, వెంకటయ్య, జగం, సుధాకర్‌రావు, అబ్దుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ



పెంట్లవెల్లి: మండల కేంద్రంలో సర్వే నంబర్ 22, 27లోని 14 ఎకరాల ప్రభుత్వ భూమిని, తీర ప్రాంగనాన్ని పెంట్లవెల్లి గ్రామ ప్రజలు ఎస్సీ, బీసీలు గురువారం ఉదయం ఆ భూమిలోని కొంత స్థలాన్ని ఆక్రమించుకుని స్థలం చుట్టూ చీరలు కట్టుకున్నారు. గతంలో ఈ స్థలం పేదలకు ఇళ్ల స్థలాల కోసం కొనుగోలు చేసినా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థలాన్ని పంచలేదు. ఇప్పటికైనా పేదలకు స్థలాలు పంచి వెంటనే ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలను పలువురు ఆక్రమించుకున్నారు. ఎన్నో ఏళ్లుగా అద్దె ఇళ్లలోనే చాలీచాలని వేతనంతో గడుపుతున్నామని, వెంటనే మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈశ్వర్, హన్మంతు, మండల ప్రజలు పాల్గొన్నారు.

నీటిబొట్టు.. ఒడిసిపట్టు

- జల సంరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు


గోప్లాపూర్‌లో మరమ్మతు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

పాన్‌గల్: గ్రామాల్లో ప్రతి యేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. సాగునీటిని అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూగర్భజలాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడుతోంది. వర్షాకాలంలో వర్షం నీరు వృథాగా కృష్ణానదిలో కలుస్తోంది. భూగర్భ జలాలు పెంపునకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించి జల సంరక్షణకు చర్యలు చేపట్టాయి. కుంటల నిర్మాణాలు, పాత కుంటల మరమ్మతు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'అమృత్ సరోవర్' పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరణ, ఉపాధి హామీ పథకంలో సమతుల కందకాలు, అటవీశాఖ ద్వారా మినీ పర్కులేషన్ ట్యాంకులు, రాతి కట్టడాలు, చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపడుతోంది. అయినప్పటికి పూర్తి స్థాయిలో పునరుద్దరణ కాకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ప్రతి మండలంలో నూతన, పాత కుంటలకు మరమ్మతు చేపట్టి నీటిని నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంది. గతేడాది ఈ పథకాన్ని ప్రారంభించగా వచ్చే ఆగస్టు 15 లోపు నిర్మాణాలు పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి అనుగుణంగా అధికారులు ప్రణాళికలు తయారు చేసి పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

ప్రతి మండలంలో కొన్ని కుంటలను పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. మండలంలోని అన్నారం, గోప్లాపూర్, చింతకుంట, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామ పంచాయితీలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లోని కుంటలను ఈ పథకం ద్వారా కొత్త కుంటల నిర్మాణాలతో పాటు పాత కుంటల పునరుద్ధరణ, పూడికతీత పనులు చేపట్టారు. ఒక్కోపనికి అవసరం మేర రూ. లక్ష నుంచి రూ.10 లక్షలలోపు వ్యయం చేసేందుకు ప్రతిపాదించారు. కుంటల మరమ్మతులతో భూగర్భ జలాలు పెంచడమే కాకుండా తాగు, సాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో చెరువులు అభివృద్ధి చేయడానికి పథకం తీసుకొచ్చింది. పనుల్లో భాగంగా ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించడమే కాకుండా చెరువు అడుగు భాగంలో 10 వేల ఘనపుటడుగుల మేర నీరు నిల్వ ఉండేలా కొలతలు ఇచ్చి ఆమేరకు పూడిక(ఒండ్రు)మట్టిని పొలాలకు తరలించేందుకు, చెరువు కట్ట పటిష్ఠతకు ఉపయోగిస్తున్నారు. పనులు పూర్తి చేసుకుంటే వానాకాలంలో కురిసే వర్షాలకు చెరువులు, కుంటలు నిండి జలకళ సంతరించుకోవడం, సమీప రైతుల వ్యవసాయ బావులు, బోరులలో నీటి మట్టం పెరగడమే కాకుండా పశువులు, వన్యప్రాణుల దహార్తి తీరనుంది. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టడంతో కూలీలకు ఉపాధి లభిస్తుంది.

మండలంలో చేపట్టిన కుంటల వివరాలు

గోప్లాపూర్ గ్రామంలో మూడు కుంటలు మంగమోని కుంట, బొరుసుకుంట, పెద్ద బొరుసుకుంట, దావాత్‌ఖాన్‌పల్లిలో కలుజుకుంట, అన్నారంలో బొమవాగుకుంట, చింతకుంటలో వలకల కుంటలను ఎంపిక చేసి పనులు నిర్వహిస్తున్నారు.

భూగర్భ జలాలు పెంపునకు దోహదం..



అమృత్‌సరోవర్ పథకం ద్వారా గ్రామాల్లో కుంటల మరమ్మతులతో భూగర్భ జలాలు పెంచేందుకు దోహదం చేస్తాయి. అటవీ ప్రాంతాల్లో కుంటల నిర్మాణంతో వర్షాకాలంలో వర్షపునీరు నిల్వకు చేసేందుకు ఉపయోగపడతాయి. ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది.

రాణి, సర్పంచ్, గోప్లాపూర్

రైతులకు ఎంతో మేలు..



భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా కుంటల మరమ్మతులతో వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దీంతో పాటు కుంటల పరిసరాలల్లోని బోరులు, బావుల్లో నీటి మట్టాలు పెరుగుతాయి. అటవీ ప్రాంతాలల్లో వీటి నిర్మాణంతో పశువులు, వన్యప్రాణాలకు దాహార్తి తీరనుంది.

బంగారయ్య, రైతు, దావాత్‌ఖాన్‌పల్లి.

పనుల పూర్తికి చర్యలు..



మండలంలో అమృత్ సరోవర్ పథకం ద్వారా కుంటల మరమ్మతు చేపట్టడంతో భూ గర్భ జలాలు పెరుగుతాయి. సమీప రైతుల వ్యవసాయ బోరుబావులల్లో నీటి మట్టం పెరగడమే కాకుండా పశువులు, వన్యప్రాణుల దాహార్తి తీరుతుంది. కూలీలకు ఉపాధి లభిస్తుంది. గోప్లాపూర్ మూడు కుంటలు, అన్నారం, చింతకుంట, దావాత్‌ఖాన్‌పల్లి గ్రామాలల్లో ఒక్కొక్క కుంట చొప్పున మరమ్మతు చేస్తున్నాం. ఎంపిక చేసిన పనులు పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకుంటాం.

నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ పాన్‌గల్

'జగదీశ్వర్‌రావుకే కాంగ్రెస్ టికెట్ ప్రకటించాలి'

కొల్లాపూర్: కొల్లాపూర్ అసెంబ్లీ టికెట్ చింతలపల్లి జగదీశ్వర్‌రావుకే ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు పరశురాం నాయుడుతో పాటు పలువురు నాయకులు గురువారం సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మంత్రి పదవులు అనుభవించిన జూపల్లి కృష్ణారావు పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు తన ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌ని వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి కూడా ఇదే తరహాలో కాంగ్రెస్ పార్టీని వీడారన్నారు. నియోజకవర్గంలో పార్టీకి పెద్దదిక్కు లేని సమయంలో జగదీశ్వర్‌రావు కాంగ్రెస్ పార్టీలో చేరి పార్టీని బలోపేతం చేశారన్నారు.

సాయిచంద్ మృతి తీరని లోటు


పెబ్బేరులో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సుభాష్ చౌరస్తాలో తెలంగాణ ఉద్యమ, ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్‌కు బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళి అర్పించారు. గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. సాయిచంద్ మృతి పార్టీకి, రాష్ట్రానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, పార్టీ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, వనం రాములు యాదవ్, కౌన్సిలర్లు ఎల్లారెడ్డి, గోపిబాబు, మహేశ్వర్‌రెడ్డి, గోవిందు నాయుడు, మేకల యల్లయ్య, బాల్‌రాం నాయుడు, సోప్పరి బీచుపల్లి, గోడుగు శాంతన్న, ఎండీ ముస్తాక్, భారతి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: గాయకుడు సాయిచంద్ అకాల మరణం పార్టీకి తీరనిలోటు అని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, సింగిల్ విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: రంగాపురం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం పలువురు సాయిచంద్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ వినీలారాణి, మండల అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు మహేష్‌గౌడ్, కురుమయ్య, సూరయ్య, చంద్రయ్య, శివశంకర్, శ్రీనివాసులు, శ్రీను, గణపతి, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.


ఖిల్లాఘనపురంలో సాయిచంద్‌కు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాన్‌గల్: గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం రాష్ట్రానికి, పార్టీకి తీరనిలోటని ఎంపీపీ మామిళ్ళపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాముయాదవ్ గురువారం వేర్వేరుగా ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యం ప్రసాదించాలని కోరారు.

అమరచింత: అమరచింత పట్టణానికి చెందిన నాయకులు సాయిచంద్‌కు నివాళులర్పించేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాలతో గురువారం ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. అనంతరం అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఆత్మకూర్: రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్, ఉద్యమ గాయకుడు సాయిచంద్ మృతిపై స్థానిక గాంధీచౌక్‌లో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారుశ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, విండోఅధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కొటేష్, బీఆర్ఎస్ మండలఅధ్యక్షుడు రవియాదవ్, బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.


రంగాపురం అంబేద్కర్ చౌరస్తాలో..


ఆత్మకూర్‌లో నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు